సాక్షి చిత్తూరు

శుక్రవారం । 20 । జూన్ । 2025



‘మద్దతు’గా నిలవాల్సిందే

మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాల్సిందేనని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ స్పష్టం చేశారు. - 10లో



మహిళలకు అండగా నిలుస్తాం

మహిళల రక్షణకు అండగా నిలుస్తామని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్ తెలిపారు. - 10లో



యథేచ్ఛగా కోడిపందేలు

పలమనేరు నియోజకవర్గం, పెద్దపంజాణి మండలం, గుండ్లపల్లె గ్రామంలో యథేచ్ఛగా కోడిపందేలు సాగుతున్నాయి. - 10లో

న్యూస్‌రీల్

రెండో విడత దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ఐటీఐ అడ్మిషన్లకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్లకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి జూలై 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుల ప్రక్రియ అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలల విద్యార్థులకు జూలై 21, 22, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల విద్యార్థులకు జూలై 23, 25 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7799679351, 9440738121 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

83,068 మందికి విత్తనాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇప్పటి వరకు జిల్లాలో 83,068 మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. జిల్లాకు తొలి విడతగా 26,370 క్వింటాళ్ల విత్తనాలు రాగా.. 83,068 మంది రైతులకు వాటిని అందజేశామన్నారు. మరో 13 వేల క్వింటాళ్ల వరకు విత్తనా లు వచ్చాయని, వాటిని కూడా మిగిలిన రైతులకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ



రైతులకు పశుదాణా బస్తాలను పంపిణీ చేస్తున్న జేడీ ఆరిఫ్

బంగారుపాళెం: రాయితీపై అందిస్తున్న పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ఆరిఫ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండలంలోని కాటప్పగారిపల్లిలో రైతులకు రాయితీపై పశుదాణా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా మండలానికి 40 టన్నుల దాణా వచ్చినట్టు చెప్పారు. రెండో విడతగా 38 టన్నులు వచ్చిందన్నారు. 50 కేజీల దాణా బస్తా ప్రభుత్వ రాయితీతో రూ.555 రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బంగారుపాళెం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసీఫ్ పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయండి



రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లకు బదిలీల్లో న్యాయం చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్న ఎంటీఎస్ టీచర్లకు గత ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందన్నారు. వారి నివాసాలకు దగ్గరలో ఉన్న పాఠశాలల్లో విధులు నిర్వహించేలా అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లకు మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో, కేటగిరీ 4 పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలకు బదిలీ చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అనారోగ్యం, వయస్సు పైబడిన ఎంటీఎస్ టీచర్లకు ప్రాధాన్యత కల్పించి, మిగిలిన పోస్టులను డీఎస్సీ అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఎంటీఎస్ టీచర్లు బదిలీలు పొందుతుండడంతో వారి కుటుంబాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన ఉన్న సీట్లకు అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని రామకుప్పం, పూతలపట్టు, విజలాపురం బాలురు పాఠశాలల్లో, చిత్తూరు, పలమనేరు, జీడీ నెల్లూరు, కుప్పం బాలికల పాఠశాలల్లో మిగిలి ఉన్న 6, 7, 8, 9 తరగతుల సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఈ నెల 25న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు చిత్తూరులోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అయ్యో మామిడి!





తవణంపల్లెలో ర్యాంపుల వద్ద తమిళనాడుకు తరలించడానికి నిల్వ ఉంచిన మామిడి కాయలు

“అష్టకష్టాలు పడ్డాం. నీళ్లునిప్పులు లేని భూములు వేలకువేలు అప్పు చేసి చదును చేశాం. కొత్త రకాల మామిడి వంగడాలను తీసుకొచ్చి సాగుచేశాం. ఎండావానకు తట్టుకుని అనుకున్న విధంగానే దిగుబడి వచ్చింది. అప్పులు తీరుతాయని ఆశపడ్డాం. కానీ ఏం లాభం...? గిట్టుబాటు ధరలేక.. సకాలంలో విక్రయించుకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో రోడ్డున పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గుజ్జు పరిశ్రమల వద్ద టోకెన్ల కోసం.. అన్‌లోడ్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇలాంటి దారుణ పరిస్థితి వస్తాదని కలలో కూడా ఊహించలేదు..’ అంటూ మామిడి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఫ్యాక్టరీల వద్ద నిరీక్షించలేక సహనం నశించి ఇంటి ముఖం పడుతున్నారు. చూపరులు వీరిని చూసి.. అయ్యో..దేవుడా! అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

గిట్టుబాటు కాని ధర

- కిలో రూ.8 కాదు..రూ.5కే కొనుగోలు చేస్తామంటున్న గుజ్జు పరిశ్రమలు
- అడిగిన ధరకు విక్రయించకపోతే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తామంటూ బెదిరింపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రోడ్డెక్కిన మామిడి రైతులు
- నోరెత్తని రైతు సంఘాలు, కూటమి ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు అల్లాడిపోతున్నారు. కూటమి నేతల మాటలకు, చేతలకు పొంతన లేకపోవడంతో రోడ్డెక్కుతున్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు గత సోమవారం బంగారుపాళెం, గంగాధరనెల్లూరు, చిత్తూరులో నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 80వేల హెక్టార్లకుపైగా మామిడి పంట సాగులో ఉంది. అందులో తోతాపురి సుమారు 50వేల హెక్టార్లలో సాగవుతోంది. దిగుబడి కూడా ఆశాజనకంగానే వచ్చింది. ఎండలు, ఈదురు గాలులను తట్టుకుని మామిడి పంట నిలబడింది. రైతులు కూడా సంబరపడిపోయారు. అధికారుల అంచనా ప్రకారం ఈ సీజన్‌లో తోతాపురి రకం 60వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగిలిన నీలం, అల్ఫోన్సో, బేనీషా, మల్లిక వంటి రకాలు మరో లక్ష మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మామిడి కోతలు పూర్తి చేసిన రైతులు పంట విక్రయించుకునేందుకు చిత్తూరు, పలమనేరు, దామలచెరువు, బంగారుపాళెం, తిరుపతి, పాకాల మార్కెట్లకు తరలివస్తున్నారు. అక్కడ ధరలు విని షాక్‌కు గురవుతున్నారు.

అందుకేనా ఈ బరితెగింపు!

తమిళనాడులో మామిడి దిగుబడిని చూసుకుని గుజ్జు పరిశ్రమల యజమానులు రెచ్చిపోతున్నారు. తాము సూచించిన ధరకే విక్రయించాలని బెదిరింపులకు దిగుతున్నారు. తమిళనాడులోని క్రిష్ణగిరి నుంచి తోతాపురి కాయలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ కేజీ రూ.4 కొనుగోలు చేసి రూ.5కు ఫ్యాక్టరీకి అన్‌లోడింగ్ అయ్యేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

ప్రభుత్వం వాటాను సైతం కొట్టేసే కుట్రలు

కిలో మామిడికి రూ.4 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించిన నేపథ్యంలో గుజ్జు పరిశ్రమల వారు, టీడీపీ నేతలు ఆ సొమ్మును కొట్టేసేందుకు కుట్రకు తెరలేపారు. తమిళనాడులోని మామిడిని తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ఏపీకి తీసుకొచ్చి రైతుల ముసుగులో గుజ్జు పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. నిజమైన రైతులు మాత్రం మామిడి దిగుబడులతో రోడ్డుపై రోజుల తరబడి వేచి ఉంటే.. బినామీ రైతుల అవతారం ఎత్తిన వారు తమిళనాడు నుంచి కొనుగోలు చేసి వెంటనే పరిశ్రమల వారికి విక్రయించి అధికారులకు వివరాలు పంపుతున్నారు.

వ్యాపారుల సిండికేట్

ఉమ్మడి జిల్లాలోని ఫ్యాక్టరీ నిర్వాహకులు, వ్యాపారులు సిండికేట్ అయ్యారు. తోతాపురి అధిక దిగుబడిని సాకుగా చూపి ధరలను తగ్గించేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు పరిశ్రమల వద్ద అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఊదరగొట్టుకునే పనిలో పడ్డారు. ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వ ప్రోత్సాహ నిధి కింద కిలోకు మరో రూ.4, వెరసి మొత్తం కిలోకు రూ.12 వస్తుంది అని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం వ్యాపారులు ఫ్యాక్టరీలతో కుమ్మక్కై ర్యాంపులు ఏర్పాటు చేసుకుని కేజీ రూ.4కే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై వరుసగా ఫిర్యాదులు చేయడంతో అధికారులు గుజ్జు పరిశ్రమల వారితో సమావేశమయ్యారు. రెండు వారాల క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ కిలో రూ.8కు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత తిరుపతి జిల్లా కలెక్టర్ కూడా వ్యాపారులతో సమావేశమై ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మామిడిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. అయితే గుజ్జు పరిశ్రమల యాజమాన్యం పట్టించుకోలేదు.



ఫ్యాక్టరీ గేటుకు ధరల పట్టిక

మంత్రి ఆదేశాలు బేఖాతర్

ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చిత్తూరుకు చేరుకుని వ్యాపారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కిలో మామిడి రూ.8 చొప్పున గుజ్జు పరిశ్రమలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి మరో రూ.4 చొప్పున రైతులకు అదనంగా చెల్లిస్తామని పేర్కొన్నారు. గుడిపాలలోని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం రూ.6 చొప్పున కొనుగోలు చేస్తోంది. మిగిలిన పరిశ్రమల వారు కిలో రూ.5కే కొనుగోలు చేస్తున్నారు. పరిశ్రమల యజమానులంతా సిండికేట్‌గా మారడంతో జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సిఫార్సులున్నవారికే టోకెన్లు

అధికారుల ఒత్తిడితో కొన్ని ఫ్యాక్టరీలు మామిడి కాయలలు కొనుగోలు కు టోకన్ల ప్రక్రియను తీసుకొచ్చాయి. ఫ్యాక్టరీలు జారీచేసే టోకన్ల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. అయితే ఫ్యాక్టరీలు మాత్రం అరకొర టోకెన్లు జారీచేసి చేతులు దులుపుకుంటున్నాయి. మిగిలినవి కూటమి పార్టీలు చెప్పిన వారికే టోకెన్లు ఇస్తూ రైతులను రోడ్డున పడేస్తున్నాయి. సిఫారసు తెచ్చుకుంటేనే టోకెన్లు అంటూ ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతుండడం గమనార్హం. టోకెన్లు జారీ చేసే సమయానికి నీకా..నాకా అంటూ పోటీపడుతున్నారు. తోపులాటలు జరుగుతున్నాయి. గంగాధరనెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి, రేణిగుంట ప్రాంతాల్లో ఈ రకమైన సమస్యలు ప్రతి రోజూ ఎదురవుతున్నాయి. గత వారం రోజులుగా పరిశ్రమల వద్ద రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఇటు రైతులు, అటు వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



రేణిగుంట ఫ్యాక్టరీ ముందు బారులు తీరిన లారీలు, ట్రాక్టర్లు

ఫ్యాక్టరీ ఎదుట నిరీక్షిస్తున్న రైతులు



గ్రా‘నైట్’..రైట్‌రైట్!

ఫ్యాక్టరీల వద్ద కూటమి నేతల రౌడీ మామూళ్లు

- ఒక్కో బ్లేడ్‌కు రూ.35 వేల చొప్పన.. నెలకు రూ.10 కోట్లు వసూలు
- కప్పం కట్టకుంటే.. మైన్స్, విజిలెన్స్ దాడులు
- అంతా తెలిసినా పట్టనట్టు వ్యవహరిస్తున్న యంత్రాంగం

చిత్తూరు అర్బన్: భూగర్భ గనులశాఖ (మైన్స్) పరిపాలన జిల్లాలో పూర్తిగా గాడి తప్పింది. సహజ ఖనిజాలను తవ్వుకున్నప్పుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజ్ (ఖనిజాల రాయల్టీ) రుసుములను వసూలు చేయాల్సిన గనులశాఖ చేతులు పైకెత్తేసింది. అధికార పార్టీకి చెందిన నాయకులు గత ఐదు నెలలుగా ఫ్యాక్టరీల నుంచి దౌర్జన్యంగా సీనరేజ్ వసూలు చేసుకుంటుంటే వేడుక చూస్తోంది. కూటమి నేతలు వేసే బిస్కట్లకు ఆశపడ్డ కొందరు అధికారులు.. ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన రూ.కోట్ల సొమ్మును నేతల జేబుల్లోకి మళ్లిం చేయడం విమర్శలకు తావిస్తోంది.

రౌడీ మామూళ్లు

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో గ్రానైట్ ఖనిజాలు విస్తారంగా ఉన్నాయి. క్వారీల రూపంలో వీటిని దక్కించుకున్న వ్యక్తులు భూగర్భ గనులశాఖ పర్యవేక్షణలో గ్రానైట్ రాళ్లను తవ్వి, వాటిని ఫ్యాక్టరీల్లో కట్ చేయించి, పాలిష్ వేసి, ఆపై విక్రయిస్తుంటారు. ఈ వ్యాపారం చేయడానికి వ్యాపారులు క్యూబిక్ మీటరు గ్రానైట్‌కు వాటి రంగు ఆధారంగా స్లాబ్ పద్ధతుల్లో ప్రభుత్వానికి సీనరేజ్ రుసుములను చెల్లించాలి. రాఘవ కన్‌స్ట్రక్చన్స్ అనే కంపెనీ ఫ్యాక్టరీల నుంచి రుసుములు చెల్లించే కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీతో ఈ కంపెనీకి రుసుములు వసూలు చేసుకునే కాల పరిమితి ముగిసింది. ప్రైవేటు కంపెనీ స్థానంలో మైన్స్ శాఖ, ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను వ్యాపారుల నుంచి వసూలు చేయాల్సి ఉంది. కానీ గత ఐదు నెలలుగా రుసుముల వసూళ్ల నుంచి మైన్స్ అధికారులను పక్కకు తోసేసిన కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు.. ఫ్యాక్టరీల నుంచి నెల నెలా బెదిరించి, బలవంతంగా రౌడీ మామూళ్లు వసూలుచేసి వారి జేబుల్లో వేసుకుంటున్నారు.



అర్ధరాత్రి ఒంటి గంటకు చిత్తూరు గాంధీ విగ్రహం మీదుగా స్మగ్లింగ్ చేస్తున్న గ్రానైట్ దిమ్మె

ఇష్టారాజ్యం

కొందరు క్వారీ యజమానులు గ్రానైట్ ఖనిజాన్ని దోచుకుంటున్నారు. నిర్ణయించిన దానికంటే భారీ మొత్తంలో గ్రానైట్ వెలికితీసి, అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రధానంగా రాత్రి 11 గంటలు దాటితే చిత్తూరు, కుప్పం, గంగాధరనెల్లూరు ప్రాంతాల నుంచి భారీ వాహనాల్లో గ్రానైట్ స్మగ్లింగ్ జరుగుతోంది. చిత్తూరుకు చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

ఒక్కో బ్లేడ్‌కు ఒక్కో రేటు

క్వారీల్లో తవ్విన గ్రానైట్ రాయిని ఫ్యాక్టరీలను తీసుకెళ్లి, అక్కడ పెద్దపాటి బ్లేడు ద్వారా కటింగ్ చేసి, వాటిని విక్రయిస్తుంటారు. కొన్ని ఫ్యాక్టరీల్లో సింగిల్ బ్లేడు ఉంటే, మరికొన్ని వాటిల్లో తొమ్మిది వరకు మల్టీబ్లేళ్లు ఉంటాయి. ప్రైవేటు కంపెనీకి ఇచ్చిన టెండరు గడువు ముగియడంతో రంగంలోకి దిగిన కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజా ప్రతినిధులు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో భేటీ అయ్యారు. ఒక్కో బ్లేడుకు నెలకు రూ.35 వేల చొప్పున.. ఎన్ని బ్లేళ్లు ఉంటే అంత మొత్తం నెలవారీగా మామూళ్లు వసూళ్లుచేస్తున్నారు. జిల్లాలో దాదాపు 3 వేల గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉంటే, 1500 ఫ్యాక్టరీల వరకు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఈ లెక్కన సగటున ఒక్కో ఫ్యాక్టరీలో రెండు బ్లేళ్లు ఉన్నాయనుకున్నా.. నెలకు రూ.70 వేల చొప్పున ఏకంగా రూ.10 కోట్ల మేర అక్రమంగా దిగమింగుతున్నారు. ఎవరైనా ఫ్యాక్టరీ నిర్వాహకులు ఈ మొత్తం ఎందుకు చెల్లించాలి..? అని ప్రశ్నిస్తే వెంటనే మైన్స్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఆ ఫ్యాక్టరీతో పాటు గ్రానైట్ వచ్చిన క్వారీపై దాడులకు దిగుతున్నారు. భారీ మొత్తంలో అపరాధ రుసుములు విధిస్తున్నారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా చెప్పుకునే ఓ అధికారి జిల్లా మొత్తం చక్రం తిప్పుతూ ప్రభుత్వ ఆదాయానికి గండిగొడుతున్నాడనే ఆరోపణలున్నాయి.



చిత్తూరులోని ఓ ఫ్యాక్టరీలో భారీగా నిల్వ ఉన్న గ్రానైట్ దిమ్మెలు

అవి పచ్చ పార్టీకి కొత్తేమీ కాదు



నగరి : యువకుల జీవితాలతో చెలగాటాలు పచ్చపార్టీకి కొత్తేమీ కాదని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే రప్పారప్పా కోస్తాం అంటూ పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడడానికి వచ్చిన జనంలో నుంచి ఒక యువకుడు ప్లకార్డు చూపడంతో వచ్చిన వివాదాలపై ఆమె గురువారం స్పందించారు. ప్లకార్డు ప్రదర్శించిన రవితేజను సత్తెనపల్లి పోలీసులు అరెస్టు చేశారని, నిజానికి రవితేజ టీడీపీకి చెందిన వ్యక్తి అన్నారు. ఉద్దేశపూర్వకంగా అలజడి సృష్టించడానికి టీడీపీ చేసిన కుట్ర అని తేటతెల్లమైందన్నారు. తమ బిడ్డ టీడీపీలో ఉన్నాడని స్వయంగా వారి కుటుంబ సభ్యులు చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. రవితేజ టీడీపీ సభ్యత్వ నమోదు కార్డును కూడా వారు చూపెట్టినట్టు గుర్తుచేశారు. రవితేజను బలవంతంగా తీసుకువెళ్లడంతోనే ప్లకార్డులు పట్టుకున్నాడని తెలిపారు.

దళితులకు అడుగడుగునా అవమానాలే!



వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వంలో దళితులకు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి ధ్వజమెత్తారు. ఎన్నికల్లో దళిత గ్రామాలకు వెళ్లి నేను పెద్ద మాదిగ అని చెప్పుకున్న వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిఠాపురం నియోజకవర్గంలో మాదిగపల్లె సామాజిక బహిష్కరణకు గురైతే ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. అలాగే నెల్లూరు జిల్లాలో దళితుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తే ఎలాంటి చర్యల్లేవన్నారు. దళిత సర్పంచ్‌ని సైతం అగౌరపరుస్తూ సభ్య సమాజం తలదించుకునేలా చేస్తే ఎందుకు మిన్నకుండిపోతున్నారని ప్రశ్నించారు. గురువారం వెదురుకుప్పంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత జాతి పట్ల ఘోర అవమానాలు జరుగుతున్నా హోం మంత్రి చర్యలు తీసుకోలేదన్నారు.

సివిల్స్ పరీక్షపై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: ఢిల్లీకి చెందిన ది ఎకనామిక్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్, తిరుపతికి చెందిన శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కెన్సెస్ హోటల్‌లో సివిల్స్ పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ గణపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సివిల్స్ శిక్షణలో నిపుణులైన ఢిల్లీకి చెందిన తేజ్‌వీర్ సింగ్, సూరజ్‌చౌదరి, సిద్ధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7013119918 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో 9 ఏళ్ల బాలిక గురువారం రాత్రి కనిపించకుండా పోయింది. బాలిక తల్లి చర్చి వీధిలో పుట్టగొడుగులు విక్రయిస్తుండగా ఆమెతోపాటు ఉన్న భార్గవి ఉన్నట్టుండి కనిపించకుండా పోయింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్ టౌన్ పోలీసులు బాలిక కోసం గాలిస్తున్నారు. రాత్రి 11 దాటినా కూడా బాలిక ఆజూకీ తెలియకపోవడంతో అటు పోలీసులు.. ఇటు కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 5,508 ప్రదేశాల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. యోగా దినోత్సవం ఏర్పాట్ల పై గురువారం క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి సచివాలయం పరిధిలో యోగా కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

జాయింట్ పట్టాల విభజనకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జాయింట్ పట్టాదారులు తమ జాయింట్ పట్టాల విభజన చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జేసీ విద్యాధరి తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులకు సదావకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నామమాత్రం దరఖాస్తు రుసుం రూ.50 చెల్లించి గ్రామ సచివాలయంలో జూన్ 30 వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

‘మద్దతు’గా నిలవాల్సిందే!

- రేపు కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల నిరసన
- ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.12 అమలు చేయాల్సిందే
- లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం
- హెచ్చరించిన రైతు సంఘాల నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి రైతులను ఆదుకోవడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి మాటలకు కూడా విలువ లేకుండా పోయిందని రైతులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శనివారం సత్యాగ్రహం నిర్వహించనున్నట్టు మామిడి రైతుల సంక్షేమ సంఘ నాయకులు జనార్దన్, ఎస్. ఆనంద నాయుడు ప్రకటించారు. జిల్లాలో గురువారం మామిడి రైతుల సంక్షేమ సంఘం కమిటీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులకు గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, ర్యాంపుల నిర్వాహకులు నరకయాతన చూపిస్తున్నారన్నారు. ఇంకోపక్క జిల్లా యంత్రాంగం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అమలు చేయాల్సి ఉండగా పూర్తిగా చేతులెత్తేయడం దారుణమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఫ్యాక్టరీ యజమానులు, ర్యాంపుల నిర్వాహకులు ధరల పట్టిక ప్రదర్శించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖాతరుచేయని ఫ్యాక్టరీల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిలో సీఎం జరిపిన సమీక్ష సమావేశంలో సైతం కిలోకు రూ.12 మద్దతు ధర కచ్చితంగా కల్పిస్తామని స్పష్టం చేసినా.. జిల్లాలో ఎక్కడా అమలు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మామిడి ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడింగ్ సైతం పూర్తిగా రాజకీయ జోక్యం పెచ్చుమీరుతోందని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పల్ప్ నిల్వలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో హరిబాబు, ఉమాపతినాయుడు, సంజీవరెడ్డి, భారతి పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలగకుండా చూస్తాం

బంగారుపాళెం: మామిడి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం బంగారుపాళెం మామిడి మార్కెట్ ఆవరణలో మామిడి మండీ యజమానులు, రైతులతో మద్దతు ధరపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తోతాపురి(బెంగళూర)మామిడి కాయలను చివర కేజీ వరకు కొనుగోలు చేస్తామన్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపటిందన్నారు. ప్రభుత్వం అందించే రూ.4 మద్దతు ధర సబ్సిడీ రూపంలో రైతుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు జమచేస్తామన్నారు. కాయలు పక్వానికి రాకముందే జ్యూస్ ఫ్యాక్టరీలకు తరలించొద్దని సూచించారు. జేసీ విద్యాధరి, మార్కెట్‌శాఖ ఏడీ పరమేశ్వర్, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.


జైన్ గుజ్జు పరిశ్రమలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆకస్మిక తనిఖీ

గంగాధరనెల్లూరు: జైన్ మామిడి గుజ్జు పరిశ్రమను గురువారం రాత్రి కలెక్టర్ సుముత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్మాగారం వద్ద ఉన్న రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మామిడి కొనుగోలుపై ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. జిల్లా హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శ్రీదేవి, జైన్ మేనేజర్ దిలీప్ శర్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ తులసీ రాం, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు

తోతాపురి మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం జీడీనెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు. మామిడి కాయల కొనుగోలుపై పరిశ్రమ యాజమాన్యం, రైతులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు తోతాపురికి మద్దతు ధర చెల్లించాలన్నారు. మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుజు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలో మామిడి దిగుబడి ఎక్కువగా ఉండడంతో ప్యాకింగ్ మెటీరియల్‌ను సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్ల కెపాసిటీని పెంచుకోవాలని సూచించారు. డీఆర్‌డీఓ పీడీ శ్రీదేవి, మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ తులసీరాం, జైన్ మేనేజర్ పాల్గొన్నారు.

మామిడి రైతుల గోడు కూటమికి పట్టదా?

బంగారుపాళెం: మామిడి రైతుల గోడు కూటమికి పట్టనట్టుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. మామిడి పంటకు కనీస గిట్టుబాటు ధర లేక గత 15 రోజులుగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారని వాపోయారు. జిల్లాలో అత్యధికంగా బెంగళూర(తోతాపురి)రకం పంటను రైతులు సాగుచేస్తున్నారన్నారు. పండిన పంటను అమ్ముకునేందుకు మండీలు, జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండీలు, ర్యాంప్‌లలో కిలో రూ.3 నుంచి రూ.4కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8కు జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చేయకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద పర్మిట్ల కోసం వారాల తరబడి తిరగాల్సివస్తోందన్నారు. పర్మిట్లు పొంది కాయలు కోసి ఫ్యాక్టరీలకు తరలిస్తే అక్కడ రోజుల తరబడి ఉండాల్సి వస్తోందని చెప్పారు. రైతులు పండించిన పంటకు వేరొక్కరు మద్దతు ధర ప్రకటించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీని సందర్శించిన జేసీ


నలగాంపల్లె జూస్‌ఫ్యాక్టరీ వద్ద మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

మండలంలోని నలగాంపల్లెలోని సన్‌గోల్డ్ జూస్ ఫ్యాక్టరీని గురువారం జేసీ విద్యాధరి సందర్శించారు. తోతాపుర మామిడి కాయలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారా లేదా, కాయల కొతలకు సంబంధించి తీసుకుంటున్న నియమ నిబంధనలు, జూస్ ఫ్యాక్టరీ వద్ద రైతులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తోతాపురి కొనుగోలు చేయాలని సూచించారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఏఓ భారతి పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన కాయలనే కోయండి

తవణంపల్లె: మామిడి రైతులు పక్వానికి వచ్చిన కాయలు కోసి ఫ్యాక్టరీలకు తరలించాలని జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు సూచించారు. మండలంలోని టి.పుత్తూరు, ఎగువ తవణంపల్లె గ్రామాల్లో మామిడి పంట కోత కోయడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.4 మద్దతు ధర చిట్టచివరి పంట వరకు ఇచ్చేందుకు జీఓ కూడా విడుదల చేసిందన్నారు. రూ.4 మద్దతు ధర ఆగిపోతుందని అపోహలు వద్దన్నారు. అనంతరం ఎఫ్‌-3 ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. రైతులకు నష్టం జరగకుండా ఫ్యాక్టరీ యజమానులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి వందన పాల్గొన్నారు.

మామిడి కాయలు అన్‌లోడ్ చేసి వెళ్తూ..!


మృతి చెందిన చంద్రశేఖర్‌నాయుడు

బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లె సమీపంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు రూరల్ మండలం, కొడిగుట్ట గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌నాయుడు, ఆయన కుమారుడు యుగేష్ మామిడి కాయలను ట్రాక్టర్‌లో బంగారుపాళెంకు తీసుకొచ్చారు. కాయలను మార్కెట్‌లో దింపి తిరిగి స్వగ్రామానికి ట్రాక్టర్‌పై బయలుదేరారు. యుగేష్ డ్రైవింగ్ చేస్తుండగా, చంద్రశేఖర్‌నాయుడు పక్కన కూర్చున్నాడు. మార్గమధ్యంలో కాటప్పగారిపల్లె వద్ద ట్రాక్టర్‌ను పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌నాయుడు (62)పై ట్రాక్టర్ ట్రాలీ చాసిస్ పడడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. యుగేష్(32) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. గాయపడిన యుగేష్‌ను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్‌నాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాక్టరీలో అన్‌లోడింగ్ దందా!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని పలు ఫ్యాక్టరీల్లో అన్‌లోడింగ్ దందా నడుస్తోంది. కొన్ని ఫాక్టరీల్లో లోడ్ దింపే వారికి రూ.50 నుంచి రూ.200 వరకు టీ, కాఫీ ఖర్చుల పేరుతో టిప్పు ఇస్తుంటారు. అప్పోసప్పో చేసి రైతులు కాయలను ఫ్యాక్టరీకి తీసుకొస్తుంటే ట్రాక్టర్ అన్‌లోడింగ్‌కు రూ.500 నుంచి రూ.800 వరకు గుంజుకుంటున్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లిలోని హయాత్ ఫుడ్స్‌లో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జేసీ విద్యాధరి గురువారం ఫ్యాక్టరీని తనిఖీ చేసినట్లు తెలిసింది. ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేస్తూ.. వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

మూలకోనలో వ్యక్తి మృతి


ధర్మ మృతదేహం

పుత్తూరు: మండలంలోని మూలకోనలో తిరుపతికి చెందిన ధర్మ (38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. బుధవారం తిరుపతికి చెందిన ఆరుగురు ద్విచక్ర వాహనాల్లో పుత్తూరు మండలంలోని మూలకోనలో సరదాగా గడిపేందుకు వచ్చారు. వారిలో తిరుపతి బాలాజీ నగర్‌కు చెందిన ధర్మ అతిగా మద్యం సేవించడంతో అపస్మారక స్థితికి వెళ్లి మృతిచెందాడు. సహచరుల ఫిర్యాదుతో పుత్తూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మంజు, కుమారుడు హేమంత్ ఉన్నారు.

గుండ్లపల్లిలో యథేచ్ఛగా కోడిపందేలు

పెద్దపంజాణి/పలమనేరు: పలమనేరు నియోజకవర్గం, పెద్దపంజాణి మండలం, కొళత్తూరు పంచాయతీ గుండ్లపల్లిలో యథేచ్ఛగా కోడిపందేలు సాగుతున్నాయి. గురువారం జరిగిన పోటీలకు ఆ ప్రాంతం వారే కాకుండా పుంగనూరు, పలమనేరు, సదుం, సోమల, ఉప్పరపల్లి ప్రాంతాలకు చెందిన పందెం కోళ్ల, నిర్వాహకులు, బెట్టింగ్ రాయుళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలోని పాఠశాల వద్ద పందేలు సాగాయి. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సొంత మండలంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక నియోజకవర్గంలో ఎలా ఉంటుందోనని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

11 మంది జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న 11 మందిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సంతపేటలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌చార్జ్ సీఐ మహేశ్వర ఆధ్వర్యంలో దాడులు చేసిన పోలీసులు 11 మందిని అరెస్టుచేసి, రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వాహకుడు శ్యామ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతడ్ని అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

మరో ఐదుగురి అరెస్ట్

పలమనేరు: కనకదుర్గ గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌లో అందులో పనిచేసే సిబ్బంది చేసిన మోసం కేసులో పలమనేరు పోలీసులు గురువారం మరో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు బ్రాంచ్‌ల్లో సిబ్బందే నకిలీ బంగారాన్ని పెట్టి రూ.8 కోట్ల రుణాలు పొందిన మోసం కేసులో వందలాది మందిని విచారించామన్నారు. ఇందులో భాగంగా ముందు ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. ఇదే కేసులో పలమనేరుకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో బొమ్మిదొడ్డి శంకరప్ప, బోసురెడ్డి, గణేష్, నరేష్‌కుమార్, భానుప్రకాష్ ఉన్నట్టు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రామ్‌నగర్ కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు బుధారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రాంనగర్ కాలనీ బీ-క్రాస్ వీధిలో ఓ మహిళ అద్దె ఇంటిని తీసుకుని, వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆమెతో పాటు ఇద్దరు మహిళలు, నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర తెలిపారు.

మహిళల రక్షణకు అండగా నిలుస్తాం

- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్



మాట్లాడుతున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్, కలెక్టర్, ఎస్పీలు

తిరుపతి అర్బన్ : మహిళల రక్షణకు.. వారి హక్కుల పరిరక్షణకు మహిళా కమిషన్ కృషి చేస్తోందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్ వెల్లడించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్, మహిళా జన్ సున్వై అనే కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పలువురు మహిళల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి పరిష్కారం చూపలేకపోవడానికి కారణాలను అధికారులు వెల్లడించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని...వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. తిరుపతి జిల్లాలోను కేసుల సంఖ్య ఎక్కువగానే ఉందని వెల్లడించారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు హెల్ప్ లైన్, మెయిల్ అందుబాటులో ఉందని...వాటి ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునని చెప్పారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం, వారి సమస్యలను చెప్పుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన ప్రతి సమస్యను పర్సనల్‌గా తీసుకొని పరిష్కారం చూపేలా మహిళా కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. తిరుపతి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీవ్ర అసంతృప్తిలో మహిళలు

నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ సభ్యులు డాక్టర్ అర్చన మజుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ఆయా శాఖల సమక్షంలో విచారించే కార్యక్రమంపై పలువురు మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపకపోగా తిరిగి కొత్తగా ఫిర్యాదు చేయాలనే సమాధానమే చెప్పడంతో నిరాశ చెందారు. పోలీసులు మహిళలను వేధిస్తున్న సమస్యలే అధికంగా వచ్చాయి. అయితే వీటి పరిష్కారానికి మళ్లీ పోలీసులనే కలవమని చెప్పడంపై అసంతృప్తికి గురయ్యారు.

అధిక సంఖ్యలో వయోవృద్ధులు చిన్నపిల్లలతో మహిళలు హాజరై మధ్యాహ్నం భోజనం కూడా లేకుండా నిరీక్షించినప్పటికీ సమస్యలు అపరిష్కతంగా మిగిలిపోవడంతో అనేక మంది మహిళలు నిరాశతో వెనుదిరిగారు.

ముసలిమడుగుకు మరో కుంకీ ఏనుగు


తిరుపతి జూ నుంచి పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు చేరిన కుంకీ ఏనుగు

పలమనేరు: మండలంలోని ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపునకు మరో కుంకీ ఏనుగు చేరింది. స్థానిక అటవీశాఖ అధికారులు తిరుపతి జూ నుంచి గనేష్ అనే కుంకీ ఏనుగును ప్రత్యేక వాహనంణంలో గురువారం ఇక్కడికి తీసుకొచ్చారు. గతంలో కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు ప్రాంతం నుంచి నాలుగు కుంకీ ఏనుగులు, ఆపై రామకుప్పం మండలంలోని ననియాల నుంచి రెండు కుంకీ ఏనుగులకు ఇక్కడికి చేరిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ ఏడు కంకీ ఏనుగులు క్యాంపులో ఉన్నాయి. కుంకీ ఏనుగుల ద్వారా కౌండిన్యలోని ఏనుగులను అదుపులోకి తీసుకొచ్చి వాటిని అడవిలోంచి పంటపొలాల వైపునకు వెళ్లకుండా చర్యలు తీసుకోనున్నట్టు స్థానిక అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

గౌరవం లేనప్పుడు.. కుర్చీలెందుకు?


ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీపీ

నగరి: ప్రజా ప్రతినిధులైన తమను అడుగడుగునా అధికారులు అవమానపరుస్తున్నారని, గౌరవం లేనపుడు సర్వసభ్య సమావేశంలో కుర్చీలపై ఎందుకు కూర్చోవాలంటూ ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు నేలపై కూర్చుని తమ నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక వెలుగు కార్యలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రజాప్రతినిధులు నేలపై కూర్చోవడంతో విస్తుపోయిన అధికారులు అలాగే నిలబడ్డారు. ఎంపీడీఓ కృష్ణయ్య సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా అధికారుల వ్యవహార శైలిపై సభ్యులు నిప్పులు చెరిగారు. ఎంపీపీ భార్గవి, జడ్పీటీసీ సభ్యుడు గాంధీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ పనులు జరుగుతున్నాయో, అవి ఎవరు చేస్తున్నారో, ఏ అధికారులు వస్తున్నారో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, చివరకు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులకు కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. పథకాలకు ఎవరు అర్హులవుతున్నారో, ఎవరు అనర్హులవుతున్నారో ఇదివరలో జాబితాను ప్రజాప్రతినిధులకు ఇచ్చేవారని ప్రస్తుతం అలా జరగడం లేదన్నారు. చెరువు ఆయకట్టు కమిటీని ఎన్నుకున్న విషయం కూడా ప్రజాప్రతినిదుల దృష్టికి రాలేదన్నారు. పాస్ ఆర్డరు అయిన రూ.45 లక్షల బిల్లులు చెల్లించకుండా ఆపి ఉంచారని, ఏవేవో కారణాలు చెబుతూ జాప్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గౌరవం లేదు.. గౌరవ వేతనం కూడా లేదు

ఏడాది కాలంగా గౌరవంతోపాటు గౌరవ వేతనం కూడా ఆగిపోయిందన్నారు. దీనిపై ఎంపీడీఓ వారి కి సమాధానమిస్తూ ఇకపై ఇలాంటివి జరగకుండా చూస్తానని, రెండు రోజుల్లో పాస్‌ఆర్డరు అయిన బిల్లుల చెల్లింపు జరిగేలా చూస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. అందరూ కుర్చీల్లో కూర్చోవాలంటూ కోరారు. దీనిపై సభ్యులు మాట్లాడుతూ రెండు రోజుల వరకు సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తామని ఆలోపు పరిష్కరించకుంటే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రోడ్డెక్కుతామన్నారు. ఆ పై అందరూ కుర్చీలపై కూర్చోగా సమావేశం ప్రా రంభమైంది. అధికారులు వారి రంగాల్లో జరుగుతు న్న పనులను సభ్యులకు వివరించారు. మామిడి త రలింపునకు ఇక్కడే టోకెన్లు ఇవ్వాలని, 108 వాహనం మునుపటిలా రావడంలేదని, గ్రావెల్ తరలింపు ఆపాలని సభ్యులు అధికారులను కోరారు. వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, కన్నియప్ప పాల్గొన్నారు.